కొండంత లక్ష్యంపై కదలిక

సిద్దిపేటజోన్: జిల్లాలోని ఆయా మున్సిపాలిటీల్లో పేరుకుపోయిన ఆస్తిపన్ను బకాయిలకు మార్చి 31 నాటికి తుది గడువుపై సాక్షిలో సోమవారం ప్రచురించిన 'కొండంత లక్ష్యం.. వసూలు అంతంత..' కథనం జిల్లాలోని బల్దియా అధికారుల్లో కదలిక తెచ్చింది. ఈ ఆర్థిక సంవత్సర లక్ష్యం అధిగమించేందుకు ఈ నెలాఖరులోగా గడువు ఉండడంతో రెవెన్యూ అధికారులు ప్రత్యేక డ్రైవ్ చేపట్టడానికి ప్రణాళికలు రూపొందించారు. అందులో భాగంగా ఆయా మున్సిపాలిటీ కమిషనర్లు క్షేత్రస్థాయిలో ఆస్తిపన్ను వసూలు ప్రక్రియ చేపడుతున్నారు. ప్రధానంగా మొండి బకాయిలను వసూలు చేసేందుకు ప్రత్యేక చర్యలు తీసుకొంటున్నారు. మార్చి 31 నాటికి బల్దియా పరిధిలోని అన్ని అస్సెస్మెంట్ పన్నులు సంపూర్ణంగా వసూలు చేసి శతశాతం లక్ష్యం అధిగమించేందుకు ప్రయత్నాలు ముమ్మరం చేస్తున్నారు. కమిషనర్, రెవెన్యూ అధికారులు, సిబ్బంది గ్రూపుల వారీగా వెళ్లి ఇంటి యజమానులకు అవగాహన కల్పించి పన్నులు వసూలు చేస్తున్నారు. ప్రజలు సకాలంలో పన్నులు చెల్లించి పట్టణ ప్రగతికి దోహదపడాలని సూచిస్తున్నారు.



ఓ దుకాణదారుడికి పన్ను రసీదు అందజేస్తున్న ఆశ్రిత్ కుమార్, సిబ్బంది



కొండాపూర్‌లో బీటలు వారిన పొలం

ఎండుతున్న పొలాలు

ఎండల తీవ్రతతో పాటు భూగర్భ జలాలు అడుగంటడంతో ఉమ్మడి మద్దూరు మండల పరిధిలోని పలు గ్రామాల్లో పంట చేలు బీటలు వారుతున్నాయి. దీంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వరి పొట్ట దశకు వచ్చే సమయంలో సాగునీరు లేక పంటలు ఎండిపోయే పరిస్థితికి వచ్చాయి. దీంతో రైతులు దిగులు చెందుతున్నారు. పంటలు ఎండిపోకుండా గోదావరి జలాలను తమ ప్రాంతానికి తరలించి, సాగునీరు అందించాలని ప్రభుత్వాన్ని వేడుకుంటున్నారు. – మద్దూరు(హుస్నాబాద్):

క్లుప్తంగా

విద్యార్థులకు అభినందనలు



విజేతలతో క్లబ్ సభ్యులు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): అలయన్స్ క్లబ్ ఆన్‌లైన్‌లో సోమవారం నిర్వహించిన అంతర్జాతీయ స్థాయి సైన్స్ క్విజ్ పోటీలలో జిల్లాకు చెందిన విద్యార్థులు రాణించారని ఆ క్లబ్ ఇంటర్నేషనల్ కమిటీ చైర్మన్ ఆత్మరాములు తెలిపారు. ఆయన మాట్లాడుతూ జూనియర్స్ విభాగంలో దీకొండ అభివర్ధన్, శిరిస్తా ప్రథమ స్థానంలోను, సీనియర్ విభాగంలో విశ్వేశ్వర్, సుభిక్ష తృతీయ స్థానంలోను నిలిచారన్నారు. విజేతలకు రూ.25వేల నగదు బహుమతి అందించనున్నట్లు తెలిపారు. సుజాత, బాలచంద్రం, సుజన, వెంకట్‌లక్ష్మి తదితరులు విద్యార్థులను అభినందించారు.

సైన్స్‌పై అవగాహన అవసరం



సైన్స్ ఫెయిర్‌ను ప్రారంభిస్తున్న ఎంఈఓ మనీల

హుస్నాబాద్: విద్యార్థులు స్కూల్ స్థాయి నుంచే సైన్స్‌పై అవగాహన పెంచుకోవాలని మండల విద్యాధికారి బండారి మనీల అన్నారు. స్థానిక సెయింట్ జోసఫ్ హైస్కూల్‌లో సోమవారం సైన్స్ ఫెయిర్ నిర్వహించారు. వివిధ అంశాల పై 400లకు పైగా ప్రయోగాల నమోనాలను ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమాలు విద్యార్థుల్లో శాస్త్రీయ ఆవిష్కరణపై ఆసక్తిని పెంచుతుందన్నారు. కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ శివయ్య, ప్రిన్సిపాల్ విజయ్ కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన బ్రహ్మోత్సవాలు

మద్దూరు(హుస్నాబాద్): దూళ్మిట్ట మండలంలోని కొండాపూర్‌లోని గట్టు మల్లికార్జున స్వామి బ్రహ్మోత్సవాలు సోమవారం ఘనంగా ముగిశాయి. గత 26 నుంచి ప్రారంభమైన ఈ ఉత్సవాలు వారం రోజులపాటు అంగరంగ వైభవంగా జరిగాయి. అర్చకులు, కమిటీ సభ్యులు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. స్వామి కల్యాణ మహోత్సవం, పెద్దపట్నం, భద్రకాళి అమ్మవారి పూజ, అగ్నిగుండ ప్రవేశంతో బ్రహ్మోత్సవాలను సోమవారం ముగించారు. సిద్దిపేట, జనగాం, హన్మకొండ, జిల్లాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకుని, ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఆర్థిక సాయం అందజేత



ఆర్థికసాయం అందజేస్తున్న మిత్రబృందం సభ్యులు

గజ్వేల్‌రూరల్: చికిత్స పొందుతున్న పలువురికి ఆపన్న హస్త మిత్రబృందం సోమవారం చేయూతనందించింది. పట్టణానికి చెందిన నితిన్, చేర్యాల మండలం కడవెరుగు గ్రామానికి చెందిన శ్రీరాములు ఆర్‌వీఎం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. వారి పరిస్థితిని తెలుసుకున్న ఆపన్నహస్త మిత్రబృందం సభ్యులు ఆర్‌వీఎం ఆసుపత్రికి చేరుకొని బాధిత కుటుంబాలను పరామర్శించారు. నితన్ కుటుంబ సభ్యులకు రూ.20 వేలు, శ్రీరాములు కుటుంబ సభ్యులకు రూ.10 వేల చొప్పున ఆర్థికసాయం అందించారు. కార్యక్రమంలో బాల్‌చంద్రం, శ్రీనివాస్, శ్యామ్‌ప్రసాద్, స్వామి, సాయి, రాజు, రాజేశం, కనకయ్య, బాల్‌నర్సు, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా పెద్దమ్మ తల్లి బోనాలు



బోనాల ఊరేగింపులో పాల్గొన్న భక్తులు

సిద్దిపేట రూరల్: మండల పరిధిలోని పెద్ద లింగారెడ్డి పల్లిలో పెద్దమ్మ తల్లి ఆలయ వార్షికోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉత్సవాల్లో భాగంగా రెండో రోజు సోమవారం బోనాలు సమర్పించారు. డప్పు చప్పుళ్ల, శివసత్తుల విన్యాసాలు, పోతురాజుల నృత్యాల నడుమ బోనాల ఊరేగింపు కొనసాగింది. పెద్దమ్మ తల్లి నామస్మరణతో పల్లెలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. ఊరేగింపులో సంఘం సభ్యులు, యువత అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

సీసీ రోడ్లతో గ్రామాలు పరిశుభ్రం

డీసీసీ అధ్యక్షుడు తూంకుంట నర్సారెడ్డి

కొండపాక(గజ్వేల్): సీసీ రోడ్లతో గ్రామాలను పరిశుభ్రంగా మార్చేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి అన్నారు. మండలంలోని మర్పడ్గ, లకుడారం, మాతేపల్లి, మేదినీపూర్ గ్రామాల్లో సీసీ రోడ్ల నిర్మాణాలకు సోమవారం ఆయన భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్నికల్లో ప్రజలకిచ్చిన హామీల మేరకు గ్రామాభివృద్ధిలో భాగంగా సీసీ రోడ్ల నిర్మాణాలకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందన్నారు. పనులు పారదర్శకంగా జరిగేలా చూసుకోవాలని సూచించారు. మర్పడ్గలోని హైస్కూల్లో మరుగుదొడ్ల నిర్మాణాలకు అదనంగా రూ.2 లక్షలు మంజూరు అయ్యాయని చెప్పారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు లింగారావు, శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు మల్లేశంగౌడ్, తిరుపతిరెడ్డి, రుషి, రాజలింగం, కనకయ్య, కిష్టారెడ్డి, కరుణాకర్, ఐలయ్య తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమమే ధ్యేయం..

గజ్వేల్‌రూరల్: ప్రజల సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తోందని నర్సారెడ్డి అన్నారు. మండల పరిధిలోని బెజుగామ గ్రామంలో మాజీ ఎంపీటీసీ, కాంగ్రెస్ నాయకులు గంగాధర్ ఆధ్వర్యంలో తయారు చేయించిన 50 డప్పులను సోమవారం ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కార్యకర్తలు రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఏఎంసీ వైస్‌చైర్మన్ సర్దార్‌ఖాన్, మాజీ సర్పంచ్ పోచయ్య, కాంగ్రెస్ నాయకులు శివారెడ్డి, బాబురావు, సాయిలు, నాగరాజు, నర్సయ్య, సత్తయ్య తదితరులు పాల్గొన్నారు.



లకుడారంలో సీసీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న నర్సారెడ్డి

బ్యాంకు ఉద్యోగుల వాకథాన్

జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ హరిబాబు

సిద్దిపేటకమాన్: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని యూనియన్ బ్యాంకు బ్యాంకు ఉద్యోగులు సోమవారం వాకథాన్ నిర్వహించినట్లు జిల్లా లీడ్ బ్యాంకు మేనేజర్ హరిబాబు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రాంతీయ కార్యాలయం నుంచి ప్రశాంత్‌నగర్ బ్రాంచ్ వరకు వాకథాన్ నిర్వహించామన్నారు. బ్యాంకు సేవింగ్ ఖాతా వివరాలు, ప్రయోజనాలు, మైక్రో సేవింగ్స్, ఎస్‌హెచ్‌జీ లింకేజీలు, బీమా సౌకర్యాలు, ముద్ర, పీఎంఈజీపీ రుణ పథకాల గురించి అవగాహన కల్పించామని, అలాగే మంగళవారం విపంచి కళానిలయంలో అవుట్‌రీచ్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. అదేవిధంగా 5న ఇర్కోడ్ గ్రామంలో మహిళలు, వృద్ధుల కోసం హెల్త్ క్యాంపు నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో స్థానిక బ్యాంకు మేనేజర్లు వికాస్, రాఘవ, సంజయ్, సిబ్బంది పాల్గొన్నారు.



వాకథాన్‌లో పాల్గొన్న హరిబాబు, ఉద్యోగులు

వైజ్ఞానిక పరిజ్ఞానం అవసరం

దుబ్బాకటౌన్: విద్యార్థులకు పాఠశాల స్థాయి నుంచే వైజ్ఞానిక పరిజ్ఞానం ఎంతో అవసరమని మహాత్మ జ్యోతిబాపూలే గురుకుల బాలుర పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు స్వప్న, రాయపోల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నాగరాజు అన్నారు. దౌల్తాబాద్ మండలం లింగరాజుపల్లి ఎంజేపీ గురుకుల పాఠశాలలో రాయపోల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థుల సైన్సు ప్రదర్శనలను సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రదర్శనలు సందర్శించి విద్యార్థులు వివిధ వైజ్ఞానిక అంశాలపై పరిజ్ఞానాన్ని సంపాదించుకున్నారన్నారు. అనంతరం కిచెన్ గార్డెన్ పరిశీలించి వివిధ రకాల మొక్కల జీవన విధానాల గురించి తెలుసుకున్నారని చెప్పారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు బాలకుమార్, చంద్రకాంత్, వెంకటలక్ష్మి, వెంకట్, సంజయ్, నర్సింగరావు, రాము, హరీశ్, స్వాతి, గోవర్ధన్ పాల్గొన్నారు.



ప్రదర్శనలు పరిశీలిస్తున్న విద్యార్థులు

ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి పూజలు

మద్దూరు(హుస్నాబాద్): రాష్ట్రంలో పంటలు సమృద్ధిగా పండి, రైతులు, ప్రజలు సుఖ, సంతోషాలతో ఉండాలని ఆ పరమశివుడిని ప్రార్థించినట్లు జనగామ ఎమ్మెల్యే పల్లారాజేశ్వర్‌రెడ్డి చెప్పారు. మద్దూరు మండల పరిధిలోని గాగిల్లాపూర్ గ్రామంలోని శివాలయంలో సోమవారం నిర్వహించిన ఏడో వార్షికోత్సవంలో ఆయన పాల్గొన్నారు. ఆలయ నిర్వాహకులు, అర్చకులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం తీర్థప్రసాదాలు అందించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు సంతోష్‌కుమార్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మల్లేశం, మాజీ సర్పంచ్ కృష్ణవేణి, చంద్రమౌళి, మల్లేశం తదితరులు పాల్గొన్నారు.



ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న పల్లారాజేశ్వర్‌రెడ్డి

కౌటింగ్ హాలు పరిశీలన

హుస్నాబాద్‌రూరల్: స్థానిక సంస్థల ఎన్నికల అనంతరం పోలింగ్ బాక్స్‌లను భద్రపరిచే కౌటింగ్ హాల్‌ను జెడ్పీ సీఈఓ రమేశ్ సోమవారం పరిశీలించారు. ప్రభుత్వ పాలిటెక్నిక్‌లో గతంలో ఎన్నికల కౌటింగ్ నిర్వహించారని, ఇప్పుడు ఆ భవనాలు అనుకూలంగా ఉంటాయని ధ్రువీకరించినట్లు ఎంపీడీఓ వేణుగోపాల్‌రెడ్డి తెలిపారు. వారి వెంట పీఆర్ డీఈ మహేశ్ ఉన్నారు.

సద్వినియోగం చేసుకోండి

సిద్దిపేటజోన్/దుబ్బాకటౌన్: స్థల క్రమబద్ధీకరణ రుసుముపై రాష్ట్ర ప్రభుత్వం 25 శాతం రాయితీ ప్రకటించిందని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్లు ఆశ్రిత్ కుమార్, శ్రీనివాస్ రెడ్డి సోమవారం వేరువేరు ప్రకటనల్లో పేర్కొన్నారు. ఈ అవకాశం మార్చి ఆఖరు వరకే ఉందని తెలిపారు. 2020లో ఎల్‌ఆర్‌ఎస్ కోసం దరఖాస్తు చేసుకున్న స్థలాల యజమానులు ఈ నెల 31లోగా రాయితీ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సందేహాలు ఉంటే 95055 07248 ఫోన్ నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

మందుబాబులకు జరిమానా

సిద్దిపేటకమాన్/సిద్దిపేటఅర్బన్: మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడిన వాహనదారులకు సిద్దిపేట కోర్టు జరిమానా, జైలుశిక్ష విధించింది టూటౌన్ సీఐ ఉపేందర్, ట్రాఫిక్ సీఐ ప్రవీణ్‌కుమార్, త్రీటౌన్ సీఐ విద్యాసాగర్ తెలిపిన వివరాల ప్రకారం పట్టణంలోని పలు ప్రాంతాలలో వారం రోజుల క్రితం నిర్వహించిన వాహన తనిఖీల్లో 24 మంది పట్టుబడ్డారు. వారిని సోమవారం కోర్టులో హాజరుపర్చగా న్యాయమూర్తి రూ.36 వేల జరిమానా, ఒకరికి 11 రోజులు, మరొక వ్యక్తికి మూడు రోజుల జైలుశిక్ష విధించినట్లు పోలీసులు తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

మద్దూరు(హుస్నాబాద్): మండలంలోని జాలపల్లి వాగు నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను రెవెన్యూ అధికారులు సోమవారం స్వాధీనం చేసుకొన్నారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మధుసూదన్ మాట్లాడుతూ నంగునూరు మండలంలోని ఖాతకు చెందిన చందు ట్రాక్టర్ ద్వారా వాగులో నుంచి ఇసుకను తరలిస్తుండగా పట్టుకొని కార్యాలయానికి తరలించామన్నారు.

చెరువులు నింపాలని నాయకుల వినతి

కొండపాక(గజ్వేల్): తపాస్‌పల్లి రిజర్వాయర్ నుంచి చెరువులకు సాగునీటిని విడుదల చేయాలని కోరుతూ అధికార పార్టీ నేతలు డీసీసీబీ చైర్మన్ చిట్టి దేవేందర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి, హౌజింగ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ మడుపు భూంరెడ్డి రైతులతో కలిసి సోమవారం అదనపు కలెక్టరు అబ్దుల్ హమీద్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత పాలకులు తపాస్‌పల్లి రిజర్వాయర్ నుంచి కాలువల ద్వారా తిమ్మారెడ్డిపల్లి, కొండపాక, దమ్మక్కపల్లి, సిర్సనగండ్ల, జప్తినాచారం, ఖమ్మంపల్లి, మర్పడ్గ గ్రామాల్లోని చెరువులను నింపుతూ పంట పొలాలు ఎండిపోకుండా కాపాడారన్నారు. అలాగే దుద్దెడ, బందారం, అంకిరెడ్డిపల్లి, దర్గా గ్రామాల్లోని చెరువులకు సైతం నీరువెళ్లేలా కాలువ తవ్వకం పనులు చేపట్టాలని కోరారు. ఎండలు ముదరడంతో చెరువుల్లో నీటి నిల్వలు ఘణనీయంగా పడిపోయాయని, ప్రస్తుతం పంటలు పొట్ట దశకు చేరుకున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే కాలువ తవ్వకాల్లో భూములు కోల్పోతున్న రైతులకు నష్ట పరిహారం చెల్లించక పోవడంతో మేదినీపూర్, లకుడారం శివారులో పనులు ఆగిపోయాయని, రైతులకు నష్ట పరిహారం చెల్లించి పనులు ప్రారంభమయ్యేలా చూడాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో నాయకులు, రైతులు పాల్గొన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

నీటి శుద్ధి యంత్రాలను ఏర్పాటు చేయాలి

బీఆర్‌ఎస్ నాయకుడు నర్సింహులు

కొమురవెల్లి(సిద్దిపేట): మల్లికార్జున స్వామి పుష్కరిణిలో(కోనేరు) నీటిని శుద్ధిచేసే యంత్రాలను అమర్చాలని బీఆర్‌ఎస్ నాయకుడు ముత్యం నర్సింహులు డిమాండ్ చేశారు. సోమవారం ఇతర నాయకులతో కలిసి స్వామి వారి పుష్కరిణిని పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పుష్కరిణిలో స్నానమాచరించి స్వామి వారిని దర్శించుకుంటే తమ కోర్కెలు తీరుతాయని భక్తుల నమ్మకం అని, అలాంటి పుష్కరిణిలో మురుగు చేరినా ఆలయ అధికారులు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్లాస్టిక్, చెత్తాచెదారం ఉండడంతో భక్తులు ఇబ్బంది పడుతున్నారని, అధికారులు స్పందించి శుద్ధి యంత్రాలతో పాటు మహిళలు దుస్తులు మార్చుకోవడానికి గదులు ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో మహేశ్, శ్రీధర్, ఆంజనేయులు, బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

లింగాకర్షణ బుట్టలతో పురుగుల నివారణ

ఏఈఓ నాగార్జున

తొగుట(దుబ్బాక): వంగసాగులో కాయ, కాండం తొలుచు పురుగు నియంత్రణకు లింగాకర్షణ బుట్టలు ఏర్పాటు చేసుకోవాలని ఏఈఓ నాగార్జున రైతులకు సూచించారు. మండలంలోని పెద్ద మాసాన్‌పల్లి మదిర ఇందిరానగర్ రైతు అనిల్‌రెడ్డి సాగుచేసిన వంకాయ తోటలో లింగాకర్షణ బుట్టల ఏర్పాటుపై రైతులకు సోమవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వంగసాగులో రైతులు అధిక మొత్తంలో పురుగు నివారణకు ఖర్చు చేస్తారని, సమగ్రసస్య రక్షణ చర్యలు చేపడితే ఖర్చు తగ్గే అవకాశముందన్నారు. ఈ పురుగు ఆశించినప్పుడు మొక్క తలవాల్చినట్టుగా కనిపిస్తుందని, అది తీవ్రంగా నష్టాన్ని కలిగిస్తుందని చెప్పారు. ఈ పురుగును నియంత్రించడానికి మొక్క నాటిన 15 రోజుల నుంచిఎకరాకు 18 లిగాకర్షణ బుట్టలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. బుట్టలో పడిపోయిన మగ పురుగుల సంఖ్యను బట్టి సస్యరక్షణ చర్యలు చేపట్టాలని, బుట్టల ఏర్పాటుతో సుమారు 30 శాతం వరకు రసాయన మందుల వాడకం తగ్గించవచ్చునని ఏఈఓ నాగార్జున చెప్పారు.



అవగాహన కల్పిస్తున్న ఏఈఓ నాగార్జున

కాంగ్రెస్ తీరుతో ఎండుతున్న పంటలు

- మల్లన్నసాగర్, కొండపోచమ్మసాగర్ కాలువలు వెలవెల
- నియోజకవర్గ ఇన్‌చార్జి వంటేరు ప్రతాప్‌రెడ్డి

గజ్వేల్: మల్లన్నసాగర్, కొండపోచమ్మసాగర్ కాలువల నుంచి సాగునీటిని వదలకపోవడంతో రైతుల పంటలు ఎండిపోయే దుస్థితి ఏర్పడిందని బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి వంటేరు ప్రతాప్‌రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. సోమవారం మండలంలోని శ్రీగిరిపల్లి వద్ద మల్లన్నసాగర్ నుంచి కొండపోచమ్మసాగర్ వెళ్లే కాలువను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కేసీఆర్ హయాంలో ఎండాకాలంలోను కాల్వలు జలకళను సంతరించుకొని ఉండేవన్నారు. సాగునీరు విడుదల కాకపోవడంతో శ్రీగిరిపల్లి, అంగడికిష్టాపూర్, గణేష్‌పల్లి, చేబర్తి, అక్కారం, పరిసర గ్రామాల్లో పంటలు ఎండిపోతున్నాయని వాపోయారు. సంబంధిత అధికారులకు ఫోన్‌చేసి విషయం చెప్పినా స్పందించడం లేదని, సాగునీరు అందించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. ప్రభుత్వ వైఖరిలో ఇప్పటికైనా మార్పురాకపోతే రైతుల పక్షాన ఉద్యమిస్తామని హెచ్చరించారు. ఆయన వెంట మండల సర్పంచ్‌ల ఫోరం మాజీ అధ్యక్షుడు చంద్రమోహన్‌రెడ్డి తదితరులు ఉన్నారు.



కొండపోచమ్మసాగర్ కాలువను పరిశీలిస్తున్న ప్రతాప్‌రెడ్డి

సంక్షిప్త వార్తలు

◆ **పేద కుటుంబానికి 'మైత్రి' చేయూత**

గజ్వేల్‌రూరల్: అనారోగ్యంతో బాధపడుతున్న ఓ పేద కుటుంబానికి రాణి మైత్రి అసోసియేషన్ చేయూతనందించింది. మండల పరిధిలోని రిమ్మనగూడకు చెందిన శివకుమార్ కూలీ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఇటీవల అనారోగ్యానికి గురై ఇబ్బందులు పడుతున్నాడు. విషయం తెలుసుకున్న ఆ అసోసియేషన్ సభ్యులు సోమవారం శివకుమార్ కుటుంబ సభ్యులకు రూ.5వేలు అందజేశారు. బండ్ల స్వామి, రవికుమార్, శ్రీనివాస్‌రావు, వెంకటరామారావు తదితరులు పాల్గొన్నారు.

◆ **రేణుకా ఎల్లమ్మ ఉత్సవాలు ప్రారంభం**

వర్గల్(గజ్వేల్): వర్గల్ రేణుకా ఎల్లమ్మ ఆలయంలో గౌడ సంఘం ఆధ్వర్యంలో వార్షికోత్సవాలు సోమవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. అంకురార్పణ పూజలు, హోమం తదితర కార్యక్రమాలు నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి సందర్శించి వేడుకలలో పాల్గొన్నారు.

◆ **అధికారం పోగానే మొసలి కన్నీరు**

చిన్నకోదూరు(సిద్దిపేట): బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో రైతులను ఏనాడూ పట్టించుకోలేదని.. అధికారం పోగానే రైతులపై మొసలి కన్నీరు కారుస్తున్నారని డీసీసీ ప్రధాన కార్యదర్శి మీసం నాగరాజు ఆరోపించారు. చిన్నకోదూరులో సోమవారం మాట్లాడుతూ మాజీ మంత్రి హరీశ్‌రావు నీటి పారుదలశాఖ మంత్రిగా ఉన్న సమయంలో సిద్దిపేట ప్రాంత రైతులను ఎప్పుడూ పట్టించుకోలేదని, అధికారం పోయాక రైతులకు సాగు నీరు ఇవ్వాలని మాట్లాడం సిగ్గు చేటన్నారు. మంత్రిగా ఉన్నప్పుడు కాలువలు తవ్వించి చెరువులు, కుంటు నింపాలని గుర్తుకు రాలేదా అని ప్రశ్నించారు. సమావేశంలో రాజు, స్వామి, సంపత్ పాల్గొన్నారు.

◆ **క్రీడలలో గెలుపోటములు సహజం**

బెజ్జంకి(సిద్దిపేట): క్రీడలలో గెలుపోటములు సహజమని బీఆర్‌ఎస్ నాయకుడు తిరుపతిరెడ్డి అన్నారు. మండలంలోని కల్లెపెల్లిలో నిర్వహిస్తున్న సర్కిల్ క్రికెట్ టోర్నీ ముగింపు కార్యక్రమంలో సోమవారం ఆయన మాట్లాడుతూ క్రీడల వల్ల స్నేహ సంబంధాలు మెరుగుపడుతాయన్నారు. విన్నర్ జట్టుకు రూ.5,016, రన్నర్ జట్టుకు రూ.3,016 నగదు బహుమతులు, ట్రోఫీలు అందజేశారు.

◆ **ఉన్నత లక్ష్యంతోనే ఉన్నత శిఖరాలకు..**

సిద్దిపేట ఎడ్యుకేషన్: విద్యార్థులు ఉన్నత లక్ష్యంతో చదివి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జీవన్ కుమార్ పిలుపునిచ్చారు. సిద్దిపేటకు చెందిన డాక్టర్ బండి శ్రీకాంత్ రచించిన 'జువాలజీ మేడ్ ఈజీ', 'ఆక్వా కల్చర్' పుస్తకాలను కళాశాలలో సోమవారం ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఇంటర్నేషనల్ స్టాండర్డ్ బుక్ నంబర్‌తో విడుదలైన ఈ రెండు పుస్తకాలను ఆవిష్కరించడం సంతోషంగా ఉందన్నారు. విద్యార్థులు వచ్చిన అవకాశాలను వినియోగించుకుని ముందుకు వెళ్లాలని సూచించారు. అనంతరం డాక్టర్ శ్రీకాంత్ మాట్లాడారు. అధ్యాపకులు సువర్ణదేవి, హరికిషన్, తిరుపతి, సుష్మ, బాలలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

◆ **గోపాలమిత్ర కుటుంబానికి ఆర్థిక సాయం**

సిద్దిపేటఅర్బన్: రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన గోపాలమిత్ర వెంకటరెడ్డి కుటుంబానికి మంత్రి పొన్నం ప్రభాకర్ చొరవతో ఆ సంఘం ప్రతినిధులు సోమవారం రూ.50 వేల తక్షణ సహాయం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వెంకటరెడ్డి మృతి చెందిన విషయాన్ని మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ దృష్టికి తీసుకు వెళ్లగానే స్పందించి సహాయం అందించారన్నారు. ఆ కుటుంబానికి సంఘం అండగా ఉంటుందని చెప్పారు. కార్యక్రమంలో శివకుమార్, శ్రీనివాస్ గౌడ్, రవీందర్ రెడ్డి, కుమార్, ఊశయ్య, ఫయాజ్, నర్సింహులు, తదితరులు పాల్గొన్నారు.

◆ **పరీక్ష వేళల్లో మార్పు చేయాలని ఆందోళన**

సిద్దిపేటజోన్: పదోతరగతి ప్రి ఫైనల్ పరీక్షల సమయాన్ని మార్చాలని ఏబీవీపీ నాయకులు సోమవారం ఆందోళన చేపట్టారు. స్థానిక ముస్తాబాద్ చౌరస్తాలో రాష్ట్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా నగర కార్యదర్శి పరశురాం మాట్లాడుతూ.. రంజాన్ మాసం పేరిట మధ్యాహ్నం 12–15 నుంచి 3–15 వరకు ప్రి ఫైనల్ పరీక్షలు నిర్వహించాలని విద్యాశాఖ ఆదేశాలు జారీ చేసిందన్నారు. అది సరికాదని ప్రభుత్వం వెంటనే తన నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో భాను, సాయి శంకర్ తదితరులు పాల్గొన్నారు.

◆ **గవ్వల దర్శనాలపై ఉచిత శిక్షణ**

హుస్నాబాద్: రాష్ట్ర ప్రభుత్వం, భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో సోమవారం కేబీ కాలనీలో రేణుకా ఎల్లమ్మ తల్లి గవ్వల దర్శనంపై ఉచిత శిక్షణ శిబిరం నిర్వహించారు. 15 మందికి 35 రోజుల పాటు గవ్వల దర్శనాలపై శిక్షణ ఇవ్వనున్నట్టు గురువు గడ్డం రామస్వామి తెలిపారు. గవ్వల దర్శనాలపై శిక్షణ పొందిన వారికి ఎల్లమ్మ తల్లి పండుగలకు ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. కార్యక్రమంలో గడ్డం సుధాకర్, ప్రభాకర్, శ్యాం, సుందర్, పెద్దులు, పరశురాములు పాల్గొన్నారు.